పార్లమెంట్ పని విధానం-కమిటీల ప్రాధాన్యం

ఆధునిక శాసన శాఖల పని విధానంలో పార్లమెంటరీ కమిటీల ప్రాధాన్యం విస్తృతమైంది. పార్లమెంట్ రూపొందించే శాసనాల సామర్థ్యం, విలువ దాని కమిటీల పని విధానంపైనే ఆధారపడి ఉంటుందని ప్రొఫెసర్ మారిస్ జోన్స్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి సామాన్య ప్రజలకు మధ్య సత్సంబంధాన్ని నెలకొల్పడంలో, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడంలో, ప్రభుత్వాల బాధ్యతారాహిత్యాన్ని నియంత్రించడంలో పార్లమెంటరీ కమిటీల ప్రాధాన్యం ఎక్కువని లోక్‌సభ మొదటి స్పీకర్ జి.వి. మౌలాంకర్ అభిప్రాయపడ్డారు.

శాసనశాఖ విధులు విస్తృతమయ్యాయి. అందువల్ల అవి సమయాభావంతో పార్లమెంటరీ కమిటీలపై ఆధారపడాల్సివస్తుంది. సాంకేతికత ఇమిడి ఉన్న శాసనాల రూపకల్పనలో నిపుణుల, ప్రత్యేక పరిజ్ఞానం కలిగినవారి అభిప్రాయాలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పార్లమెంటరీ కమిటీలకు పుట్టినిల్లుగా బ్రిటన్‌ను పేర్కొంటారు. శాసన కమిటీలు ప్రస్తుత కాలంలో మినీ శాసన వ్యవస్థలుగా అవతరించాయని ప్రముఖ పాలనావేత్త, అమెరికా మాజీ అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ పేర్కొన్నారు. పార్లమెంట్ సమయాన్ని సద్వినియోగం చేయడంలో, ఏకకాలంలో అనేక బిల్లులను సమగ్రంగా పరిశీలించి విలువైన శాసనాలను రూపొందించడంలో పార్లమెంటరీ కమిటీలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ప్రభుత్వాల పనితీరు వాటి శాసనాలపై, శాసనాల విలువ కమిటీల పని విధానంపై ఆధారపడి ఉంటుంది. ఆడంబరాలు, పటాటోపాల మధ్య జరిగే పార్లమెంట్ సమావేశాల కంటే పార్లమెంటరీ కమిటీలకు ప్రాధాన్యం కల్పించినట్లయితే శాసనాల విలువ పెరగడమే కాకుండా వాటి ప్రయోజనం కూడా విస్తృతమవుతుందని ప్రముఖ పార్లమెంటేరియన్ హిరేన్ ముఖర్జీ అభిప్రాయపడ్డారు.

కమిటీల ముఖ్య లక్షణాలు

పార్లమెంటరీ కమిటీలు ప్రధానంగా సలహా సంఘాలుగా పని చేస్తాయి. కమిటీల పదవీ కాలం ఏడాది. పార్లమెంటరీ కమిటీల సమావేశానికి కావలసిన కనీస సభ్యుల సంఖ్య కోరం 1/3 వంతు. కమిటీలు పార్లమెంట్ సమావేశాలు ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా సమావేశాలు నిర్వహించుకోవచ్చు. కమిటీల సమావేశాలు పార్లమెంట్ భవనంలోనే నిర్వహిస్తారు. ఢిల్లీ వెలుపల నిర్వహించాలంటే స్పీకర్ అనుమతి పొందాలి. కమిటీల్లో మంత్రులు సభ్యులుగా ఉండరాదు. ఒకవేళ సభ్యులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తే కమిటీలో వారి సభ్యత్వం రద్దవుతుంది. సంయుక్త పార్లమెంటరీ కమిటీలు ఏర్పాటు చేసినపుడు లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల ప్రాతినిధ్యం 2:1గా ఉంటుంది. పార్లమెంటరీ కమిటీల్లో స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్లు సభ్యులుగా ఉంటే వారు ఆయాకమిటీలకు అధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తారు. ఉభయసభల్లోని ఆయా పార్టీల ప్రతినిధుల సంఖ్యను బట్టి వారికి వివిధ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పిస్తారు.

కమిటీల రకాలు:

పార్లమెంటరీ కమిటీలను ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

- స్టాండింగ్ కమిటీలు
- అడహాక్ కమిటీలు.

ఆయా సందర్భాలను అనుసరించి ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేయవచ్చు. అడహాక్ కమిటీలు తమకు అప్పగించిన తాత్కాలిక బాధ్యతలను నెరవేర్చిన తరువాత రద్దవుతాయి.

ఎ) సభ్యుల-సౌకర్యాలకు సంబంధించిన కమిటీలు

బి) సభా కార్యక్రమాలకు సంబంధించిన కమిటీలు

సి) విచారణ కమిటీలు

డి) పరిశీలక కమిటీలు

ఇ) ఆర్థిక కమిటీలు, పార్లమెంట్ ద్వారా ఏర్పడే కమిటీలు

ఈ కమిటీల్లో సభ్యులను మూడు పద్ధతుల ద్వారా నియమిస్తారు. అవి..

- నియామకం
- పార్లమెంట్ తీర్మానం
- నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఎన్నుకోవడం

సభావ్యవహారాల సంఘం, నిబంధనల కమిటీ, సాధారణ అవసరాల కమిటీ మొదలైనవాటికి లోక్ సభస్పీకర్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. కమిటీలు తమ నివేదికలను స్పీకర్‌కు సమర్పిస్తాయి. కమిటీలపై లోక్‌సభ స్పీకర్ అజమాయిషీ కలిగి ఉంటారు.

కొన్ని ముఖ్యమైన కమిటీలు:

సభా వ్యవహారాల కమిటీ:

సభ్యుల సంఖ్య 15. దీనికి స్పీకర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. సభా వ్యవహారాలు సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలను చర్చిస్తుంది.

వేతనాలు-భత్యాలకు సంబంధించిన కమిటీ:

రాజ్యసభ నుంచి ఐదుగురు, లోక్‌సభ నుంచి 10 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధ్యక్షులను స్పీకర్ నియమిస్తారు. కమిటీ సమావేశాలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖామంత్రి హాజరవుతారు. జీతభత్యాలపై కమిటీ సూచనలను చేస్తుంది.

- సాధారణ అవసరాల కమిటీ

- సభా హక్కుల సంఘం
- ప్రభుత్వ వాగ్దానాలపై కమిటీ
- వసతి సౌకర్యాల కమిటీ
- దత్తాశాసనాధికారంపై కమిటీ

ఆర్థిక కమిటీలు:

ప్రభుత్వం వివిధ శాఖలకు కేటాయించే నిధులు, వాటిని సద్వినియోగం చేయడంలో ప్రభుత్వ రంగ సంస్థలు సమర్థవంతంగా పనిచేసేట్లుగా తన నియంత్రణను ఈ కమిటీల ద్వారా పార్లమెంట్ కలిగి ఉంటుంది.

ప్రభుత్వ ఖాతాల సంఘం:

1921లో ఏర్పడిన ఈ కమిటీ అతి పురాతనమైంది. కమిటీలోని సభ్యుల సంఖ్య 22. లోక్‌సభ నుంచి 15 మంది, రాజ్యసభ నుంచి 7గురు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిపై ఎన్నికవుతారు. అధ్యక్షులను స్పీకర్ నియమిస్తారు. ప్రతిపక్షానికి చెందిన వారిని చైర్మన్‌గా నియమించే సంప్రదాయం 1967 నుంచి కొనసాగుతోంది. CAG రిపోర్టు ఆధారంగా ప్రభుత్వ రికార్డులను పరిశీలించి నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది.

అంచనాల సంఘం:

1950లో జాన్‌మత్తయ్ కమిటీ సూచనలను అనుసరించి ఏర్పడింది. దీన్నే నిరంతర మితవ్యయ కమిటీ అంటారు. 30 మంది సభ్యులుగా ఉండే ఈ కమిటీని పూర్తిగా లోక్‌సభ సభ్యులతో నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిపై ఎన్నుకొంటారు. చైర్మన్‌ను స్పీకర్ నియమిస్తారు. ప్రభుత్వ అంచనాల్లో మిత వ్యయం, పొదుపు, ప్రత్యామ్నాయ పద్ధతులను ఈ కమిటీ సూచిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థల కమిటీ:

1962లో లంకా సుందరం అనే పార్లమెంట్ సభ్యుడి ప్రశ్నను అనుసరించి నియమించిన కృష్ణమీనన్ కమిటీ సిఫార్సు మేరకు ఈ కమిటీని 1964లో ఏర్పాటు చేశారు. మొత్తం సభ్యుల సంఖ్య 22. లోక్‌సభ నుంచి 15 మంది, రాజ్యసభ నుంచి 7గురు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిపై ఎన్నికవుతారు. చైర్మన్‌ను స్పీకర్ నియమిస్తారు. BHEL, HAL, LIC లాంటి సంస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన సూచనలను ఈ కమిటీ చేస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ పద్ధతి ద్వారా భారత పార్లమెంట్ పరిపాలనపై నియంత్రణను కలిగి ఉంటుంది? (సివిల్స్ 2001)

ఎ) పార్లమెంటరీ కమిటీలు

బి) వివిధ మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కమిటీలు

సి) కాలానుగుణంగా సమర్పించే నివేదికలు

డి) రిట్‌లను జారీ చేయడానికి కార్యనిర్వాహక శాఖపై ఒత్తిడి చేయడం

2. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షులను నియమించేది? (సివిల్స్ 2007)

ఎ) లోక్‌సభ స్పీకర్ బి) రాజ్యసభ చైర్మన్

సి) సభ్యులే ఎన్నుకుంటారు డి) రాష్ట్రపతి

3. రైల్వే జోన్ల కోసం పార్లమెంట్ సభ్యులతో కూడిన కన్సల్టేటివ్ కమిటీని ఏర్పాటు చేసేవారు? (సివిల్స్ 2002)

ఎ) రాష్ట్రపతి బి) రైల్వే మంత్రిత్వ శాఖ

సి) పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

డి) రవాణా మంత్రిత్వశాఖ

4. కింది వాటిలో ఏ పార్లమెంటరీ స్థాయీ సంఘాల కిందికి అంచనాల సంఘం వస్తుంది? (గ్రూప్-1 2008)

ఎ) పరిశీలన సంఘాలు

బి) ఆర్థిక వ్యవహారాల సంఘాలు

సి) సభా వ్యవహారాల సంఘం డి) విచారణ సంఘం

5. కింది అంశాల్లో అంచనాల సంఘానికి సంబంధించి ఏది అసత్యం?

ఎ) ఎటువంటి మితవ్యయ కార్యకలాపాలు చేపట్టవచ్చో నివేదించడం

బి) మితవ్యయం, సామర్థ్యం పెంపొందించడానికి ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం

సి) పార్లమెంటరీ అంచనాలు ఎలా సమర్పించాలో సూచించడం

డి) ప్రభుత్వ వ్యయాన్ని పరీక్షించడం

6. ప్రభుత్వ రంగ సంస్థల సంఘం ఏర్పడిన సంవత్సరం?

ఎ) 1964 బి) 1947 సి) 1950 డి) 1960

7. నిరంతర మితవ్యయ సంఘం అని దేన్ని వర్ణిస్తారు?

ఎ) పబ్లిక్ రంగ సంస్థల కమిటీ

బి) ప్రభుత్వ ఖాతాల సంఘం

సి) అంచనాల సంఘం డి) సభా వ్యవహారాల సంఘం

8. పార్లమెంటరీ ఆర్థిక కమిటీలు ఎవరి ఆజ్ఞ, మార్గదర్శకత్వంలో పని చేస్తాయి?

ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్

సి) పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి డి) ప్రధానమంత్రి

సమాధానాలు

1 ఎ	2 ఎ	3 సి	4 బి	5 సి
6 ఎ	7 సి	8 బి		